ఫోబియా పరేషాన్ -8లో

- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం
- నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు



ఆగుతూ.. సాగుతూ!

నత్తనడకన రావు గోపాలరావు కళా క్షేత్రం ఆధునికీకరణ పనులు

- గత ఏడాది మార్చిలో ప్రారంభం
- ఇంతవరకు కొలిక్కిరాని వైనం
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు
- వాస్తుకు విరుద్ధంగా మరుగుదొడ్ల నిర్మాణం
- కూల్చివేసి, మరోచోట నిర్మించాలని అధికారి ఆదేశం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పట్టణంలోని డాక్టర్ రావు గోపాలరావు కళా క్షేత్రం ఆధునికీకరణ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. పనులు మొదలుపెట్టి ఏడాదిన్నర గడిచినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, వీఎంఆర్‌డీఏ అధికారుల ఉదాసీనతే ఇందుకు కారణమని అర్థం అవుతున్నది.



అసంపూర్తిగా ఉన్న డాక్టర్ రావు గోపాలరావు కళా క్షేత్రం ఆధునికీకరణ పనులు

అనకాపల్లి పట్టణంలో 2000 సంవత్సరంలో డాక్టర్ రావు గోపాల రావు కళా క్షేత్రాన్ని అప్పటి ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు కృషితో ఏర్పాటు చేశారు. ఈ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే సుమారు ఐదేళ్ల నుంచి కళా క్షేత్రానికి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పలుచోట్ల పాడైపోయింది. కళా క్షేత్రం దుస్థితిపై స్థానికులు అనేక పర్యాయాలు వీఎంఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు 2022 సంవత్సరంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఈ కళా క్షేత్రానికి ఆధునికీకరణ పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదించారు. పనులు చేపట్టేందుకు పరిపాలన పరమైన ఆమోదం లభించినప్పటికీ నిధుల విడుదలలో నాటి వైసీపీ పాలకులు తీవ్ర జాప్యం చేశారు. ఎట్టకేలకు గత ఏడాది సాధారణ ఎన్నికల ముందు కళా క్షేత్రం ఆధునికీకరణకు కోటి



ఈశాన్యంలో నిర్మించిన మరుగుదొడ్లను తొలగిస్తున్న కూలీలు

రూపాయాలను వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా శంకుస్థాపన పనులు మొదలుపెట్టించిన వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు.. తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిపేశారు.

ప్రభుత్వం మారినా అంతే...

గత ఏడాది సాధారణ ఎన్నికల తరువాత కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో కళా క్షేత్రం ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తవుతాయని స్థానికులు భావించారు. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కళా క్షేత్రం ఆధునికీకరణ, ఇతరత్రా పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించారు. మార్చిలో ఈ పనులకు మరోసారి టెండర్ల ప్రక్రియ నిర్వహించి ముగ్గురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కళా క్షేత్రం లోపల విద్యుత్, సీలింగ్, మరుగుదొడ్లు, పెళ్లికొడుకు, పెళ్లి కూతురు విశ్రాంతి గదులు నిర్మించేందుకు, ఇంటీరియర్ పనులకు రూ.47 లక్షలు కేటాయించారు. కళా క్షేత్రం ఆవరణలో రోడ్డును ఆనుకొని రూ.98 లక్షలతో దుకాణ సముదాయాన్ని, దీనిపైభాగంలో, లోపల రూ.1.2 కోట్లతో నాలుగు విశ్రాంతి గదులు నిర్మించ తలపెట్టారు. అయితే ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు వేగవంతం చేయడం లేదు. జిల్లా కేంద్రం అయిన తరువాత అనకాపల్లిలో వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయానికి

... మిగతా 8వ పేజీలో

యూరియా కొరత లేదు

- జిల్లాకు ఇంతవరకు 1,055 టన్నులు సరఫరా
- ఇప్పటికే 902 టన్నులు కొనుగోలు చేసిన రైతులు
- ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌లలో 152 టన్నుల నిల్వలు
- పక్షం రోజుల్లో మరో 270 టన్నుల యూరియా రాక
- వరి పంటకు అవసరమైన సమయంలో ఎరువులు సరఫరా
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి



మీడియా సమావేశంలో యూరియా వివరాలను వెల్లడిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో 1,055 టన్నుల యూరియాను అందుబాటులో వుంచామని, ఇందులో రైతులు 902 టన్నులు కొనుగోలు చేయగా, మరో 152 టన్నులు ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం ఇక్కడ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, మరో పదిహేను రోజుల్లో 270 టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 10,274 హెక్టారుల్లో వరి పంట వేశారని, రైతులకు 1,926 టన్నుల యూరియా అవసరమని తెలిపారు. ఎకరాకు 75 కిలోల యూరియా అవసరమని, నిర్ణీత

... మిగతా 8వ పేజీలో

స్త్రీశక్తికి అనూహ్య ఆదరణ

ఆర్టీసీ బస్సుల్లో క్రమేపీ పెరుగుతున్న మహిళా ప్రయాణికులు

- 22 రోజుల్లో మొత్తం ప్రయాణికులు **6,42,293** మంది
- ఉచితంగా ప్రయాణించిన మహిళలు **3,62,719** మంది
- మొత్తం ప్రయాణికుల్లో **56.47** శాతం మంది
- స్త్రీశక్తి పథకం కింద రూ.**1.43** కోట్లకుపైగా మహిళలకు లబ్ధి



మహిళలతో కిక్కిరిసిన నర్సీపట్నం నుంచి తాండవ వెళ్లే ఆర్టీసీ బస్సు

నర్సీపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం కూటమి ప్రభుత్వం 'స్త్రీశక్తి' పథకాన్ని అమలు చేసిన తరువాత బస్సుల్లో మహిళా ప్రయాణికులు గణనీయంగా పెరిగారు. ఆగస్టు 15వ తేదీ నుంచి సెప్టెంబరు ఆరో తేదీ వరకు 22 రోజుల వ్యవధిలో నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి రాకపోకలు సాగించిన బస్సుల్లో మూడున్నర లక్షల మందికి మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిటకిటలాడుతూ, పలువురు నిల్చుని ప్రయాణిస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని గత నెల 15వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. అయితే నర్సీపట్నం డిపోలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేవు. డిపోలో 74 ఆర్టీసీ, 28 అద్దె బస్సులు కలిసి మొత్తం 102 బస్సులు వున్నాయి. వీటిలో వైజాగ్ నాన్ స్టాప్, కాకినాడ, హైదరాబాద్, విజయవాడ సర్వీసులు మినహా మిగిలిన 82 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో స్త్రీశక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. గత నెల 15వ తేదీ నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు నర్సీపట్నం డిపో నుంచి నడిచిన బస్సుల్లో మొత్తం 6,42,293 మంది ప్రయాణించారు. వీరిలో ఉచితంగా ప్రయాణించిన మహిళలు 3,62,719 మంది వున్నారు. టికెట్ తీసుకున్న ప్రయాణికులు 2,79,574 ఉన్నారు. మొత్తం మీద 56.47 శాతం మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఈ 22 రోజుల్లో ఆర్టీసీకి వచ్చిన మొత్తం ఆదాయం రూ.3,40,63,496 కాగా.. ఇందులో స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.1,43,39,450, ఇతర ప్రయాణికుల ద్వారా రూ.1,97,24,046 ఆదాయం వచ్చింది. అయితే వైజాగ్ రూట్లో నాన్ స్టాప్ సర్వీసుల ఆదాయం గతంతో పోలిస్తే బాగా తగ్గిపోయింది. స్త్రీ శక్తి పథకం

... మిగతా 8వ పేజీలో

డెక్కన్ రెమెడీస్‌లో కెమిస్ట్ మృతి

- నాలుగు రోజుల క్రితం విషవాయువు పీల్చడంతో అస్వస్థత
- ఆస్పత్రికి తరలించిన సహచర ఉద్యోగులు
- పరిస్థితి విషమించడంతో మృతి



మరడాన పోలినాయుడు (ఫైల్ ఫొటో)



మిథనాల్ స్వాలెంట్ రియాక్టర్‌ను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా సిటీలోని డెక్కన్ రెమెడీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో విష వాయువు పీల్చడంతో కెమిస్ట్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం చినబొండపల్లి గ్రామానికి చెందిన మరడాన పోలినాయుడు (41) ఫార్మా సిటీలోని డెక్కన్ రెమెడీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సీనియర్ కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. అగనంపూడిలో కుటుంబంతో నివాసం వుంటున్నాడు. ఈ నెల ఐదో తేదీన పోలినాయుడు ఏ షిఫ్ట్‌కు హాజరయ్యాడు. ప్రొడక్షన్ బ్లాక్‌లోని మిథనాల్ స్వాలెంట్ (ఎంఈ) రియాక్టర్ ద్వారా ప్రాసెసింగ్ ప్రక్రియను దగ్గరుండి

... మిగతా 8వ పేజీలో

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం!

మండలాల్లో కుండపోతగా వాన

మిగిలినచోట్ల తేలికపాటి జల్లులు

అనకాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం తరువాత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ.. అనంతరం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. చోడవరం, కశింకోట, సబ్బవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల మండలాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భారీ వర్షం కురిసింది. అనకాపల్లి, మునగపాక, మాడుగుల, మాకవరపాలెం మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో ఆకాశం మేఘావృతమైంది. కాగా దేవరాపల్లి మండలంలో మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఏ.కొత్తపల్లిలో పిడుగుపాటుకు గుర్రై గేదె మృతిచెందింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్టు బాధితురాలు శతపతి ఈశ్వరమ్మ వాపోయారు.



చోడవరం మండలం గంధవరంలో కురుస్తున్న వర్షం



చోడవరం కొత్తూరు జంక్షన్‌లో వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్న గొయ్యి



చోడవరం మండలం గజపతినగరం వద్ద వర్షం నీటితో కాలువలా మారిన ప్రధాన రహదారి

చోడవరంలో భారీ వర్షం

చోడవరం, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది. రెండు గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం నాలుగు గంటల

... మిగతా 8వ పేజీలో

నూకాంబిక అమ్మవారి పునర్దర్శనం ప్రారంభం



మూలవిరాట్ ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు, సిబ్బంది



సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

- చంద్రగ్రహణం కారణంగా ఆలయంలో సంప్రోక్షణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక ఆలయంలో అమ్మవారి పునర్దర్శనం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైంది. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు ఆలయ తలుపులు తెరిచి, సంప్రోక్షణలో భాగంగా మూలవిరాట్ ఆలయంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. తరువాత అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం తొమ్మిది గంటలనుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆలయ ఉత్సవకమిటీ మాజీ ప్రతినిధులు, కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అనుమతులు లేకుండా ఎరువుల విక్రయం

తట్టబందలోని దుకాణంలో అధికారుల తనిఖీలు

- 4.9 టన్నులు స్వాధీనం
- నిషేధిత 17:17:17 సరఫరా గురించి ఆరా

రావికమతం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని తట్టబందలో అనుమతులు లేకుండా ఎరువులు విక్రస్తున్న దుకాణంపై విజిలెన్స్, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 4.9 టన్నుల ఎరువులను స్వాధీనం చేసు కుని, షాపును సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి ఆయా అధికారులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.



తట్టబందలో అనుమతులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్న దుకాణంలో విజిలెన్స్, వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు

తట్టబందకు చెందిన కండేలా అప్పారావు అనే వ్యాపారి బలిజపాలెం వెళ్లే రోడ్డును ఆనుకొని ఎరువుల షాపు నడుపుతున్నాడు. ఇక్కడ అధిక మొత్తంలో ఎరువులను నిల్వచేసి, ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. అంతేకాక నిషేధిత 17:17:17 ఎరువును బ్లాక్‌లో విక్రయిస్తున్నాడు. ఈ వ్యాపారిపై ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో మండల వ్యవసాధికారి రమేశ్‌బాబు, రావికమతం ఎస్ఐ రఘువర్మ, వీఆర్వో బాలజీరావు సోమవారం సాయంత్రం ఎరువుల దుకాణానికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో 2.55 టన్నుల ఎస్‌ఎస్‌పీ, 1.25 టన్నుల 17:17:17 రకం ఎరువు, 0.81 టన్నుల యూరియా, 0.2 టన్నుల పోటాష్, 0.1 టన్నుల వేప పిండి వున్నాయి. మొత్తం 4.9 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకొని, దుకాణాన్ని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియపరిచినట్టు వ్యవసాధికారి రమేశ్‌బాబు తెలిపారు. 17:17:17 ఎరువును ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఈ వ్యాపారికి ఎక్కడి నుంచి సరఫరా అయిందో విచారణ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

92 నోటీసుల కోసం రైతుల నిరీక్షణ

- మూడు నెలలు దాటినా జారీ చేయని రెవెన్యూ అధికారులు
- గత వైసీపీ హయాంలో తప్పుల తడకగా భూములు రీ సర్వే
- రెవెన్యూ శాఖకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ సర్వేకు ఆదేశాలు
- తొలుత ప్రతి మండలంలో రెండు గ్రామాలు ఎంపిక
- 'మాకవరపాలెం'లో లచ్చన్నపాలెం, పైడిపాలల్లో భూముల రీసర్వే
- మూడు నెలల క్రితం ప్రక్రియ పూర్తి
- రైతులకు ఇంతవరకు జారీ కాని '92 నోటీసులు'
- భూముల వివరాలు ఆన్‌లైన్ కాకపోవడంతో ఇక్కట్లు



లచ్చన్నపాలెం సచివాలయంలో రైతులకు '92 నోటీసులు' అందజేస్తున్న ఆర్డీవో వీవీ రమణ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో సంబంధిత రైతులకు ఇంతవరకు '92 నోటీసులు' జారీ చేయలేదు. నోటీసు అందుకున్న రైతులు భూమి ఎంత

... మిగతా 8వ పేజీలో

రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగింపు



మూలపేటలో ఎక్స్‌కవేటర్‌తో తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

మునగపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను ఎక్స్‌కవేటర్‌ ద్వారా తొలగింపు చర్యలు చేపట్టామని సర్పంచ్‌ బీశెట్టి గంగఅప్పల నాయుడు తెలిపారు. మండలంలో మూలపేట గ్రామంలో సోమవారం ప్రధాన రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుప్పలు కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, అందువల్ల వాటిని తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'విద్యా రంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతర పోరాటం'

ఎలమంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యా సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం శ్రమిస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ అన్నారు. సోమవారం మునిసిపాలిటీ యర్రవరం సమీపంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ చలో విజయవాడ కార్యక్రమంలో న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణమన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా కార్యక్రమాలు చేపడతామన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

కోటవురట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఎంఈవో రామారావు అన్నారు. సోమవారం మండలంలోని బీకేపల్లిలో నిర్వహించిన పోషకాహారం మాసోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ పోషకాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందుతారన్నారు. గ్రామ సర్పంచ్‌ పెట్ల లింగంనాయుడు మాట్లాడుతూ. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం ఉన్న పదార్థాలను తీసుకోవాలన్నారు. మాంసాహారం కంటే కూరగాయల ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యం విషయంలో బాలింతలు గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సైబర్‌ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం మొబైల్‌ వీడియో ప్రదర్శన ద్వారా వివిధ నేరాలు, చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. స్థానిక మంగవరంరోడ్డులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సైబర్‌ నేరాలు, పోక్సో చట్టం, గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌, మత్తుపదార్థాలతో జరిగే నష్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భవానీ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కమిటీలో అచ్యుతాపురం నుంచి ఆరుగురు



నూతనంగా ఎంపికైన సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా కమిటీలో అచ్యుతాపురం నాయకులకు పెద్దపీట వేశారు. ఈనెల 6,7 తేదీల్లో చోడవరంలో జరిగిన సీఐటీయూ మహాసభల్లో అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా రొంగలి రాము, సభ్యులుగా కె సోమునాయుడు, కర్రి నాయుడు, ఏ నాగేశ్వరరావు, రాజన సత్తిబాబు, పి నారాయణమ్మలను ఎంపిక చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి. చెందుతున్న అచ్యుతాపురంలో కార్మికులతో పాటు అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై నిరంతర పోరాటాలు చేసి, వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

ఎరువుల కోసం ఆందోళన వద్దు : ఎంపీడీవో



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీవో డీ సీతారామరాజు అన్నారు. సోమవారం మండలంలోని గుల్లిపాడు, దోసలపాడు, దేవవరం, జీ జగన్నాథపురం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీని పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, సెక్రటరీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో పలు రైళ్లు ఆపాలని వినతి

ఎలమంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల హాల్టు మంజూరు చేయాలని కోరుతూ రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్టు ఎలమంచిలి ప్రయాణికుల సంక్షేమ సంఘం ప్రతినిధి కర్రి సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలమంచిలిలో పలు రైళ్లకు హాల్ట్‌ మంజూరు చేయాలని కోరారు. ఎలమంచిలి రైలు స్టేషన్‌లో మహబూబ్‌నగర్‌, రత్నాచల్‌, గరీబ్‌రథ్‌, ప్రశాంతి, ఎల్‌టీటీ, స్వర్ణ జయంతి, ఉదయ్‌ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్‌ ఇవ్వాలని సౌత్‌ సెంట్రల్‌ రైల్వే జీఎంతోపాటు పలువురు ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

వెంకటనగరం జగనన్న కాలనీలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

పాయకరావుపేట రూరల్‌, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కాలనీ వాసులు విద్యుత్‌ శాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీలో గతంలో ఆరు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ మధ్య కాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందని ఎవ్వరికీ తెలియకుండా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ ఉంచి మిగతా ట్రాన్స్‌ఫార్మర్లు వేరే ప్రాంతానికి తరలించుకుపోయారని కాలనీకి చెందిన జి. సుజాత, కె.లక్ష్మి, ఎం.రమణమ్మ, శేషగిరి, కవిత తదితరులు ఆరోపిస్తున్నారు. కాలనీలో ఒక ట్రాన్స్‌ఫార్మరే ఉండడం వలన లోడు పెరిగి తరుచూ విద్యుత్‌ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. చిన్న పిల్లలతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్‌ రోడ్డు భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆధునిక ఉపకరణాలు ఎంపిక కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్‌ దివ్యాంగులందరితోనూ మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ దివ్యాంగుల పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. దివ్యాంగుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, వాటిని వెలికి తీసేందుకు తల్లిదండ్రులతో పాటు భవిత కేంద్ర నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు అరుణ్‌ కుమార్‌, శ్రీనివాసరావు, కో-ఆర్డినేటరు రామకృష్ణ, కూటమి నేతలు బొద్దపు శ్రీను, కోరారు శ్రీను, ఊటకూటి రమేష్‌, బొద్దపు శ్రీను(రమణ), గుర్రాల శేఖర్‌ పాల్గొన్నారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్‌

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి : ప్రగడ

అచ్యుతాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను టీడీపీ నేతలు, కార్యకర్తలు తిప్పికొట్టాలని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని,దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రస్తుతం యూరియా అన్ని కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉందని, ఇప్పటికే 90 శాతం రైతులకు యూరియాని పంపిణీ చేశారన్నారు. కాని రైతులకు యూరియా అందడం లేదని నీచ రాజకీయాలను వైసీపీ నాయకులు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉన్నతంగా వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ప్రైవేటు, ప్రభుత్వం సహకారంతో ప్రోత్సహిస్తుంటే తట్టుకోలేక కువిమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం దశ, దిశ మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌, మంత్రి లోకేష్‌ నిరంతరం కృషిచేస్తున్నారని దీనికి అంతా సహకరించి, అవాస్తవాలను ప్రచారం చేస్తున్న వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధూళి రంగనాయకులు, కొలుకులూరి విజయరామరాజు, వీలా తులసీరామ్‌, గొర్లె నానాజీ, పెంటకోట విజయ్‌, నీరుకొండ నర్సింగరావు, కె. సూర్యనారాయణ, మామిడి శివ అప్పారావు, యాండ్ర అప్పలనాయుడు, రవికుమార్‌ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

పునరావాసం కల్పించిన తర్వాతే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

అంతవరకు గ్రామాన్ని విడిచి వెళ్లేది లేదు..

సమస్యలు పరిష్కరించకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటాం

కలెక్టర్‌, ఏపీఐఐసీ, ఆర్డీఓలకు సీతపాలెం నిర్వాసితులు స్పష్టీకరణ

రాంబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెజ్‌ ఏర్పాటుకు గ్రామాన్ని, భూములిచ్చి ఇబ్బందులు పడుతున్నామని లాలంకోడూరు శివారు సీతపాలెం గ్రామానికి చెందిన సెజ్‌ నిర్వాసిత నాయకులు సోమవారం కలెక్టర్‌, ఏపీఐఐసీ, ఆర్డీఓ, తహశీల్దార్‌ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసిత నాయకులు మాట్లాడుతూ సెజ్‌ ఏర్పాటుకు 2006లో భూసేకరణ చేశారని, నష్టపరిహారం కింద ఎకరాకు రూ.5.5లక్షలు ఇచ్చారన్నారు. జిరాయితీ భూములకు, కొన్ని ఇళ్లకు పరిహారం ఇచ్చారన్నారు. గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో మా గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్‌, ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించి, గ్రామాన్ని వేరే చోటకు తరలించిన తర్వాతే పరిశ్రమలు నిర్మించుకోవాలని, అంత వరకు ఎటువంటి పనులు జరుగనివ్వమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి 5 సెంట్లు ఇళ్ల స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.15 లక్షలు ఇవ్వాలని, కుటుంబాలు వారీగా అందరికి ఒకే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జీవనోపాధి కల్పించాలని తదిత డిమాండ్లతో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచ్‌ రుత్తల గుణాకర్‌, రుత్తల రుద్రతేజ, ఎం.నానాజీ, ఎం. నాయుడుబాబు, లాలం సంతోష్‌, ఎం. సత్యం, రుత్తల రఘు, డి.నరసింహరాజు, రుత్తల గిరిబాబు, లాలం గణేష్‌, రుత్తల సురేష్‌కుమార్‌, ఎం.రమణబాబు, రుత్తల హరిబాబు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ జడ్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీతపాలెం నిర్వాసిత నేతలు

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

జనసేన మండల అధ్యక్షుడు నూకన్నదొర

ఎరువులన్నీ పుష్కలంగా ఉన్నాయి..

రాంబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల సమస్య తలెత్తకుండా కూటమి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 6 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 50 శాతరం నాట్లు పడ్డాయన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అధికారులు అందిస్తున్నారన్నారు. రైతులకు ఉన్న అవసరాన్ని అనుసరించి ఎరువులను అందుబాటులో ఉంచారన్నారు. గ్రామాల్లో ఎక్కడ ఎరువుల కొరత లేదన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైసీపీ నాయకులు గ్రామాల్లో తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనకు రైతుల్లో వస్తున్న ఆదరణ చూసి వైసీపీ ఓర్వలేకపోతుందన్నారు. వైసీపీ వారు గ్రామాల్లోకి వెళ్లి ఎన్ని గిమ్మికులు చేసినా ప్రజలు నమ్మరన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని నూకన్నదొర వైసీపీ శ్రేణులను హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు గబ్బర్‌ సింగ్‌, మంగరాజు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నూకన్నదొర, తదితరులు

అక్షరాస్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : చైర్‌పర్సన్‌ రమాకుమారి

ఎలమంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్య ద్వారా అక్షరాస్యతా శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ రమాకుమారి అన్నారు. సోమవారం పట్టణంలోని మెప్మా కార్యాలయ ఆవరణలో అక్షర ఆంధ్రా(ఉల్లాస్‌) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ ఉల్లాస్‌ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతా పెంచేందుకు వలంటీర్లుగా ముందుకు వచ్చిన వారందరిని అభినందించారు. ప్రతి వలంటీరు 10 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఉల్లాస్‌ ప్రోగ్రామ్‌ వయోజన విద్య డైరెక్టరు చిన్ని కృష్ణ మాట్లాడుతూ ఎలమంచిలిలో 3,998 మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందన్నారు. వారందరినీ అక్షరాస్యులుగా చేయడానికి 400 మంది మెప్మా ద్వారా వలంటీర్లని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్‌ కమిషనర్‌ ప్రసాదరాజు తదితరులు ప్రసంగించారు. అనంతరం అక్షర జ్యోతి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మేనేజరు పద్మావతి, సీవోలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పేట బయ్యవరం పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం. ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు యోగా చేసేందుకు మ్యాట్‌లనువిశ్రాంత సైనికోద్యోగులు పి.శంకరరావు, టి. రామకృష్ణ, అప్పల సత్యనారాయణ అందజేశారు. .

నక్కపల్లిలో..

మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా నిరక్షరాస్యులకు 9వ తరగతి విద్యార్థులతో విద్యాబోధన చేయించారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు హేమ, నందిని, చరిష్మా నిరక్షరాస్యులకు అక్షరాలు, అంకెలను నేర్పించారు. హెచ్‌ఎం వి.బాలాజీ, ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ అక్షరాస్యతతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎస్‌.జయశ్రీ, తెలుగు పండిట్‌ ఎన్‌వీఎస్‌ ఆచార్యులు ఆధ్వర్యంలో విద్యార్థులతో అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, వి.పద్మావతి, రమేశ్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అక్షరజ్యోతి పుస్తకాలను ఆవిష్కరించిన ఉల్లాస్‌ ప్రోగ్రామ్‌ డైరెక్టరు చిన్నికృష్ణ, చైర్‌పర్సన్‌ రమాకుమారి

ఆలయాలు, మండపాల్లో గ్రహణ శుద్ధి పూజలు

మునగపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం మూసివేసిన ఆలయాలు, వినాయక మండపాల్లో సోమవారం శుద్ధి పూజలు నిర్వహించారు. నిమజ్జనం చేయని వినాయక మండపాల్లో సోమవారం వాడ్రాపల్లి తదితర గ్రామాల్లో శుద్ధి పూజలు నిర్వహించారు. అభిషేకాలు, హోమాలు నిర్వహించి, దర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు, మణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరో 30 టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు



కోటవురట్ల సొసైటీలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ జనార్దన్‌

కోటవురట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం మరో 30 టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు పంపామని కోటవురట్ల సొసైటీ చైర్‌పర్సన్‌ వేచలపు జనార్దన్‌ అన్నారు. సోమవారం పీఏసీఎస్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల డిమాండ్‌మేరకు యూరియా రప్పిస్తున్నామన్నారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు రైతులకు 245 టన్నుల యూరియాను పంపిణీ చేసినట్టు తెలిపారు. అదనంగా మరో 30 టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, సొసైటీ డైరెక్టర్‌ సత్యనారాయణ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పీ. సూర్యారావు పాల్గొన్నారు.

బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో సత్తా చాటిన వినీల

మునగపాక, సెప్టెంబర్‌ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి మోడల్‌ స్కూళ్లో ఇంటర్‌ చదువుతున్న వి.వినీల రాష్ట్ర స్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో సత్తా చాటింది. స్టేట్‌ లెవెల్‌లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు వినీల అర్హత సాధించిందని కళాశాల వ్యాయామ ఉపాధ్యాయిని మహాలక్ష్మి తెలిపారు. వినీలను పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు అభినందించారు.



మెడల్‌ సాధించిన వినీల

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



పెదగుమ్ములూరు పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

ఎస్‌.రాయవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన బదిలీ అయిన హెచ్‌ఎం సుధాకర్‌, ఉపాధ్యాయులు శ్రీను, జాన్‌, అరుణకుమారి, సంజీవిలను ప్రస్తుత హెచ్‌ఎం సుధా మాధురి ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు. పాఠశాలలో విద్యార్థులకు వారు అందించిన వారి సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్లి మరొకసారి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను చూసి పలువురు విద్యార్థులు ఆనంద బాష్పాలు రాల్చారు.

వైసీపీది దొంగ పోరు

గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ భీమరశెట్టి శ్రీను

మునగపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల పేరుతో వైసీపీ చేస్తున్నది దొంగ పోరు అని ఏపీ గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ భీమరశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో వ్యవసాయ సాగు గణాంకాలకు అనుగుణంగా యూరియాతో పాటు ఎరువులు దిగుమతి అయ్యాయని, ఇంకా అవుతూనే ఉన్నాయని చెప్పారు. దిగుమతి అయిన ఎరువులను రైతులకు పారదర్శకంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. కావాలనే వైసీపీ తప్పుడు ఆరోపణలుతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. దిగజారుడు రాజకీయాలకు వైసీపీ పాల్పడుతోందన్నారు.

రైతు పోరును విజయవంతం చేయాలి

ఎలమంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ఈనెల 9 వ తేదీన నిర్వహించ తలపెట్టిన రైతు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ కన్వీనర్‌ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వైసీపీ క్యాంపు కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బోదెపు గోవింద్‌, మునిసిపల్‌ వైస్‌ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా తదితర నేతలతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, బ్లాక్‌ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్‌, కౌన్సిలర్లు రాపేటి సంతోష్‌, దూది నరసింహమూర్తి, నేతలు దాసరి కుమార్‌, దుంగా అచ్యుతరావు, కొటారు కొండబాబు పాల్గొన్నారు.

మునగపాకలో..

రైతుపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ప్రసాద్‌ క్యాంపు కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ ఆవిష్కరణను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మద్దాల వీరునాయుడు, బొడ్డేడ శ్రీను, ఆడారి కాశిబాబు, కాండ్రేగుల జగన్‌, బొడ్డేడ లిల్లీ పి.సత్యనారాయణ, ఆడారి రాంబాబు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విజిలెన్స్‌ విచారణ

దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్‌

పాయకరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో అక్రమ లేఅవుట్లు, పంచాయతీ స్థలాల ఆక్రమణలపై త్వరలో చేపట్టనున్న విజిలెన్స్‌ విచారణ నిష్పక్షపాతంగా చేయాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీలో ఇప్పటివరకు 200 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో 10 శాతం ప్రజోపయోగం కోసం కమ్యూనిటీ స్థలాలు కేటాయించారని, వాస్తవానికి రెండు, మూడు ఎకరాల కూడా లేని పరిస్థితి ఉందన్నారు. వీటిపై విజిలెన్స్‌ విచారణకు హోంమంత్రి అనిత ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఎంక్వైరీ పార్టీలక తీతంగా నిష్పక్షపాతంగా చేసి, అన్ని లేఅవుట్లలో 10శాతం కమ్యూనిటీ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించాలని డిమాండ్‌ చేశారు.

పాడి రైతులకు పప్పు దినుసులు పంపిణీ

మునగపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని జెర్సీ డెయిరీ పాడి రైతులకు పప్పు దినుసులు పంపిణీ చేయడం సంతోషకరమని టీడీపీ నాయకుడు ఆడారి జనార్దనరావు అన్నారు. మండలంలో మూలపేట జెర్సీ పాల కేంద్రం వద్ద సోమవారం సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పాల కేంద్రం కార్యదర్శి కొయిలాడ శివాజి పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

రాంబిల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి పీహెచ్‌సీ పరిధిలోని మూడు పంచాయతీలలో ఆశ కార్యకర్తల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్‌ బాలగంగా శ్రావణి తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని దిమిలి, మూలజంప, హరిపురం గ్రామాల్లో ఆశా కార్యకర్తల నియామకాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 13లోపు ఆసక్తి గల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

పాయకరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు పాయకరావుపేటలో ఈనెల 9వ తేదీన వైకల్య నిర్ధారణ, ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఎంఈఓలు కేఎన్‌.గాంధీ, జి.రమేష్‌ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో 18 సంవత్సరాలలోపు దివ్యాంగ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్‌ చైర్స్‌, ట్రై సైకిళ్లు, రోలేటర్స్‌, బ్యాటరీ ట్రై సైకిళ్ల వంటి ఉపకరణాలు అందజేయానికి చర్యలు తీసుకుంటామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, సదరం సర్టిఫికెట్‌, ఆదాయ ధ్రువపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకురావాలని వారు కోరారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా పాలమరశెట్టి



మునగపాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుయువత మండల అధ్యక్షుడిగా పొలమరశెట్టి మోహనరావు నియమితులయ్యారని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. టి.సిరసపల్లి గ్రామానికి చెందిన మోహన్‌రావు పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పదవిలో నియమించినట్టు ఆయన తెలిపారు. వివిధ పదవుల్లో నియమించిన వారందరూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

కొప్పల వెలమ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాంబాబు



పాయకరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా టీడీపీ సీనియర్‌ నాయకుడు చింతకాయల రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. కాగా రాంబాబు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందరి బాధ్యత

▸▸ పోలీసుల శిక్షణ శిబిరంలో జిల్లా అదనపు ఎస్పీ మోహన్‌రావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మోహన్‌రావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఉచిత వైద్యం అందించడంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఇక్కడ అనకాపల్లి సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న అధికారులు, స్టేషన్ రైటర్లు, సీసీ టీవీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు మాట్లాడుతూ క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత అందరిదిగా పేర్కొన్నారు. ఇటువంటి సమయాల్లో పోలీసు సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఐటీ కోర్ బృందం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ఇన్‌స్పెక్టర్లు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు


ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 40వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'నేత్రదాన ఆవశ్యకత- నేత్రదాన ప్రాముఖ్యత'పై జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై నిరాధార పోస్ట్ పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు


ఎస్ఐ కృష్ణారావుకు ఫిర్యాదు కాపీని అందిస్తున్న కూటమి నాయకులు

పరవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అతని సోదరుడు ప్రసాదరావుపై వాట్సాప్ గ్రూపులో నిరాధారమైన పోస్ట్ పెట్టిన షేక్ ఇస్మాయిల్‌పై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు పరవాడ ఎస్ఐ కృష్ణారావును సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. పరవాడలో ఇటీవల చోటు చేసుకున్న లిక్కర్ స్కాంలో ఎమ్మెల్యే, అతని సోదరుడు ఉన్నట్లు వాట్సాప్ గ్రూప్‌లో నిరాధారమైన పోస్ట్ పెట్టడం దారుణమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటన చోటు చేసుకోకుండా సదరు వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రూప్ అడ్మిన్ బండారు చిన్నంనాయుడును విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస కాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, గొంతిన రాము, పెదిశెట్టి సత్యారావు, మోటూరు హరిబాబు, వెన్నెల నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రాత్రి వేళ ఫేస్‌వాష్ చేసుకోవాలి : సీఐ


కశింకోట జంక్షన్‌లో డ్రైవర్‌తో ఫేస్‌వాష్ చేయిస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు లారీ, వ్యాను వంటి పెద్ద వాహనాల డ్రైవర్లు ఎప్పటికప్పుడు ఫేస్ వాష్ చేసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారిలోని కశింకోట జంక్షన్ వద్ద పలు వాహనాలను ఆపి ఆయా డ్రైవర్లతో ఫేస్‌వాష్ చేయించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి వాహనాలను రాత్రి సమయంలో నిర్విరామంగా నడపడం వల్ల నిద్రలోకి జారుకునే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలోనే ప్రమాదాలకు ఆస్కారం ఉందని వివరించారు. డ్రైవర్లు ఎప్పటికప్పుడు రాత్రి వేళ ముఖాన్ని కడుక్కోవాలన్నారు.

నిరుపేద కళాకారులకు 'కాప్' చేయూత

▸▸ కళాకారుల వివరాలు సేకరించి త్వరలో ప్రత్యేక డైరీ

▸▸ సినీ హాస్యనటుడు గౌతంరాజు


సినీ నటుడు గౌతంరాజును సన్మానిస్తున్న లాఫింగ్ క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కళాకారుల ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (కాప్) కృషి చేస్తుందని ప్రముఖ హాస్యనటుడు భూపతిరాజు గౌతంరాజు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, మధ్యతరహా కళాకారుల వివరాలను సేకరించి త్వరలో ప్రత్యేక డైరీ రూపొందించనున్నట్టు వెల్లడించారు. ఈ డైరీని బుల్లితెర, సినిమా రంగాల దర్శక, నిర్మాతలకు అందజేస్తామని, తద్వారా కళాకారులకు ఆయా సీరియళ్లు, సినిమాలు, ఇతర కార్యక్రమాల్లో నటించే అవకాశం లభిస్తుందని చెప్పారు. సినీ కళాకారులతో కొన్ని ఈవెంట్‌లు నిర్వహించి తద్వారా సమకూరే డబ్బులతో నిరుపేద కళాకారులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా లాఫింగ్ వార్డును ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ ప్రతినిధులు గౌతంరాజు, వెంకటరమణలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విల్లూరి వీరసంతోశ్, ఉపాధ్యక్షులు బుద్ధ ప్రవీణ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం సంత.. అసౌకర్యాల చింత

▸▸ వర్షం కురిస్తే ఎక్కడికక్కడ నిలిచిపోతున్న నీరు ▸▸ వ్యాపారులతో పాటు కొనుగోలుదారులకు తీవ్ర ఇబ్బందులు ▸▸ రోడ్డుపై దుకాణాలు పెడుతుండడంతో ట్రాఫిక్ సమస్య


తాళ్లపాలెంలో జరుగుతున్న వారపు సంత

కశింకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే ఇక్కడ ప్రత్యక్ష నరకమే చూస్తున్నామని అంతా వాపోతున్నారు. ఆశీల వసూలుపై ఉన్న శ్రద్ధ, సౌకర్యాల కల్పనపై లేకపోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ మం డింది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో సంత ప్రాంతం తడిసి ముద్దయింది. వ్యాపారులు, సరకుల కొనుగోలుకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడం వల్ల కొన్నిచోట్ల చిన్నపాటి చెరువును తలపించింది. గత్యంతరం లేక పలువురు ఆ నీటిలో నుంచి వెళ్లే తమకు కావాలసిన సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు.

ఇక్కడి వాడుక నీరు, వర్షపు నీరు బయటకు పోయేందుకు గతంలో సంత నుంచి మర్రి చెట్టు వరకు ఇరు వైపులా కాలువలు ఉండేవి. వాటిని కప్పి వేయడం వల్ల నీరు నిలిచిపోతోంది. సంత జరుగుతుండే ప్రాంతం పల్లపు ప్రాంతం కావడంతో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు సంతలోకి చేరుతోంది. సంత ప్రాంతాన్ని ఎత్తు చేసి కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్ట లేకపోతున్నారు. డ్రైనేజీలు నిర్మిస్తే నీరు సమీపంలో ఉన్న పోలవరం కాలువలోకి వెళుతుందని తద్వారా సమస్య పరిష్కారం అవుతుందని పలువురు సూచిస్తున్నారు. ఇదిలావుంటే, సంతలో కొంత వరకు షెడ్ల నిర్మాణం జరిగినప్పటికీ వాటిని ఇంకా ఎవరికీ కేటాయించ లేదు. మిగిలిన స్థలంలో కూడా షెడ్లు నిర్మించి గొర్రెలు, మేకలు, కోళ్ల అమ్మకం దారులను కేటాయిస్తే ప్రయోజనం ఉంటుంది. సంతలో సౌకర్యాలు లేకపోవడం వల్ల నర్సీపట్నం వెళ్లే ప్రధాన రోడ్డుపై చిరు వ్యాపారులు దుకాణాలు పెడతుండడంతో పాటు కోళ్ల అమ్మకాలు చేపడుతున్నారు. దీనివల్ల సంతరోజున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సంతకు ఎదురుగా ప్రధాన రోడ్డు పూర్తిగా నిర్మాణం చేపట్టక పోవడం వల్ల పెద్ద గొయ్యి ఏర్పడి నీరు నిలిచిపోతోంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రధాన రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీలు, షెడ్లు ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.


సంత ప్రాంతంలో నిలిచిపోయిన వర్షపు నీరు

మాస్టర్ ప్లాన్ ప్రకారం అనకాపల్లి అభివృద్ధి

▸▸ ఎమ్మెల్యే కొణతాల వెల్లడి ▸▸ పట్టణంలో విస్తృతంగా పర్యటన ▸▸ వివిధ ప్రాంతాల్లో పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం


రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ ప్రకారం అనకాపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పరమేశ్వరీ పార్కు, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియానికి వెళ్లారు. మరిడిమాంబ ఆలయ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులకు ఆదేశిం చారు. ఇండోర్ స్టేడియంలో అసంపూర్తి పనులను పూర్తి చేయాలన్నారు. పరమేశ్వరీపార్కులో మౌలిక వసతులు, ఆర్వో ప్లాంట్, టాయిలెట్స్ వంటి వాటిని మెరుగుపరచాలని సూచించారు. పనిచేయని లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పార్కును ఆనుకొని ఉన్న స్థలంలో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని రూ.40 లక్షలతో పూర్తిచేస్తామన్నారు. యోగా సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్టీఆర్, ఇండోర్ స్టేడియంల నిర్వహణకు క్రీడాకారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. పట్టణంలోని పరమేశ్వరీ పార్కు, శాంతి పార్కు, గాంధీ నగరం, లక్ష్మీనారాయణనగర్‌లలో గల పార్కులను రూ.కోటితో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పరమేశ్వరీ పార్కు ఆవరణలో రూ.కోటితో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లక్ష్మీదేవిపేట వద్ద నిలిచిపోయిన ఫ్లై ఓవర్ వంతెన పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఈఈ శేఖర్, టీపీవో కనకారావు, నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్లు పీలా నాగశ్రీను, బీఎస్ఎంకే జోగినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం పక్కాగా అమలు చేయాలి : ఆర్డీవో


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆర్డీవో షేక్ ఆయిషా ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుష సంతాన ప్రాధాన్యం, మూఢ నమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా ఆడ పిల్లలపై వివక్షత జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. అధికారులు కూడా ఇందు కోసం తమవంతు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎన్‌జీవోఎస్ సంఘాలకు దేవరాపల్లి, అచ్యుతాపురం, మాడుగుల మండలాల్లో ఈ చట్టంపై అవగాహన కల్పించాలని ఆర్డీవో సూచించారు. ఈ సమీక్షలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె.రాకేష్, ఎన్‌జీవో సమిధ ప్రతినిధి డి.వీరభద్రరావు, దిశ ఎన్‌జీవో ప్రతినిధి అశ్విని, డిప్యూటీ డెమో అధికారి ఎస్.రమణరావు, హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి ఎన్వీ రమణమ్మ, పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ


సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందిస్తున్న పీలా గోవింద

కశింకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం, ఉగ్గినపాలెం, విస్సన్నపేట, రామన్నపాలెం, తేగాడ గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. కశింకోటలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తొమ్మిది మందికి రూ.3.42 లక్షల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలను ఆదుకునేందుకే సీఎం సహాయ నిధిని అందిస్తున్నట్టు చెప్పారు. సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ముత్రాసి కాలనీలో బావిని పూడ్చాలని ఆందోళన


జీవీఎంసీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న కాలనీవాసులు

తుమ్మపాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముత్రాసి కాలనీలో ప్రమాదకరంగా మారిన బావిని తక్షణమే పూడ్చివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ ముత్రాసి కాలనీలో పూర్వం కాలంలో నిర్మించిన బావి ప్రస్తుతం ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ పాడు బడిన బావిలో చెత్తాచెదారంతో పాటు పశువులు, కుక్కల కళేబరాలను వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యపై గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, బావిని పూర్తిగా పూడ్చివేయాలని జీవీఎంసీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయినప్పటికీ నేటి వరకు పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.బాబాజీరావు, చింతా ఓంశివ, బొడ్డు శ్రీనివాస్, ఎస్.దుర్గా, అప్పలరాజు, చింతాహరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన యాత్రకు దూరం

▸▸ కొందరు కార్పొరేటర్ల నిర్ణయం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతదేశ అధ్యయన యాత్రకు కొందరు కార్పొరేటర్లు విముఖత చూపుతున్నారు. ప్రజా ధనం వెచ్చించి అధ్యయన యాత్ర పేరుతో విహార యాత్రలకు వెళ్లడం సరికాదని, అందుకే తాము తిరస్కరిస్తున్నట్టు మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు తెలియజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు సోమవారం మేయర్, కమిషనర్‌లకు లేఖ పంపించగా, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అధ్యయన యాత్రకు తాను రాబోవడం లేదని అధికారులకు లిఖితపూర్వకంగా ఇప్పటికే సమాధానం ఇచ్చారు. అలాగే 91వ వార్డు కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా స్వర్ణలత కూడా అధ్యయన యాత్రను బహిష్కరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి యాత్రకు దూరంగా ఉంటున్నట్టు ఇతర కార్పొరేటర్లకు తెలిపినట్టు సమాచారం.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం తగదు'

తుమ్మపాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. దీనివల్ల ఎంబీబీఎస్‌కు విద్యార్థులు దూరమయ్యే ప్రమాదముందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు 107, 108లను తీసుకువచ్చి నూతన మెడికల్ కళాశాలల్లో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను బీ, సీ కేటగిరీలుగా విభజించిందన్నారు. బి.కేటగిరికి రూ.12లక్షలు, సీ. కేటగిరికి రూ.25లక్షలకు విక్రయించడంతో పెద్ద సంఖ్యలో ప్రతిభ గల విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యారన్నారు. ప్రస్తుత కూటమి నాయకులు అధి కారం చేపట్టకముందు వైద్య కళాశాలలను శతశాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని హామీ ఇచ్చి, విస్మరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, నాయకులు లత, సీత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామి దర్శనాలు పునః ప్రారంభం



కశింకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కశింకోటలో గల ప్రముఖ వేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామివారి పనర్ దర్శనాలు ప్రారంభమయ్యాయి. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్ర ఈ ఆయాన్ని మూసి వేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఎస్సీ మహిళా వసతి గృహం ఏర్పాటుకు వినతి

తుమ్మపాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఎస్సీ మహిళా వసతి గృహన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్యవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఫణీంద్ర మాట్లాడుతూ అనకాపల్లిలో ఎస్సీ మహిళా వసతి గృహం లేకపోవడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కారణంగా పలువురు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు శశి, బన్నీ, అజయ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమృతపురంలో ప్రభుత్వ భూమి స్వాధీనం


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమృత పురంలో ఆక్రమణకు గురైన సర్వే నెంబరు 379లో గల 35.64 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తహశీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో జగ్గునాయుడు సోమవారం రికార్డులను పరిశీలించారు. అనంతరం సరి హద్దులు నిర్ణయించి సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్ట ప్రకారం నేరమన్నారు.

24 మద్యం బాటిళ్లతో వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మిరియాల కాలనీ వద్ద మద్యం బాటిళ్లను కొని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. పిసినికాడకు చెందిన మళ్ల మురళీకృష్ణ బీరు బాటిళ్లు కొని తెస్తుండగా పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది తనిఖీ చేసి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

బీమా పాలసీలపై జీఎస్టీ మినహాయింపు పట్ల హర్షం

కొత్తూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ మినహాయింపు ఇవ్వడం పట్ల ఎల్ఐసీ ఏజెంట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి బ్రాంచిలో ఉద్యోగులు, ఏజెంట్లు కేక్ కట్‌చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీనియర్ ఏజెంట్లు పీలా శ్రీనివాసరావు, ఐతా రాము, సత్యారావు తదితరులు మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని వ్యతిరేకిస్తూ ఉత్తమ పార్లమెంటీరియన్ అవార్డు గ్రహీత దివంగత బాసు దేవాచార్య ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. దాని ఫలితంగానే ఈ విజయం సాధించినట్టు చెప్పారు. ఏజెంట్లు లాలం నాగేశ్వరరావు, నూకఅప్పారావు, నడిశెట్టి అప్పారావు, దుర్గారావు, కరణం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బూసిపల్లికి పాఠశాల మంజూరు చేయాలి

▸▸ కలెక్టర్‌కు పెసా కమిటీ, గ్రామస్థులు వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పెసా కమిటీ, గ్రామస్థులు

జి.మాడుగుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలభం పంచాయతీ బూసిపల్లి గ్రామానికి పాఠశాల మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు పెసా కమిటీ మండల ఫోరం నాయకులు, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం పాడేరులో కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో 50 కుటుంబాల్లో 60 మంది వరకు చిన్నారులు పాఠశాల లేక రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకృష్ణాపురంలో వెళ్లి చదువుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో వర్షకాలంలో ఊరు నుంచి పంట పొలాలు మధ్య పెద్ద వాగు దాటుతూ వెళ్లాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితిలో బడికి పంపించడానికి ఆందోళన చెందుతున్నామని కలెక్టర్‌ని విన్నవించారు. రహదారి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తమ పంట పొలాలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నమన్నారు. ఈ కార్యక్రమంలో పెసా మండల ఫోరం అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, లక్ష్మణరావు, స్థానికులు నాగేశ్వరరావు, అర్జున్, ధనర్జన్, శివాజీ, గోపినాథ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా అటవీ పనులు

జి.మాడుగుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీరం పంచాయతీ వి.కోడాపల్లి అటవీ ప్రాంతంలో ముమ్మరంగా తోటల పెంపకం పనులు చేపడుతున్నారు. జి.మాడుగుల అటవీ రెంజ్ పరిధిలో కాంప పథకం ద్వారా 10 హెక్టార్లలో వివిధ వృక్ష జాతుల మొక్కలను నాటుతున్నారు. అటవీ విస్తీర్ణం పెంచే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్టు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

టీచర్లను నియమించాలని తల్లిదండ్రులు వినతి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.ధారకొండ పంచాయతీ పరిధి పెబ్బంపల్లి, తడకపల్లి, గొల్లపల్లి గ్రామాల జీపీ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మూడు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఎంఈవో-1 తగ్గి సత్యానారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎ.ధారకొండ సర్పంచ్ ముర్ల చంటిబాబు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పెబ్బంపల్లి, తడకపల్లి, గొల్లపల్లిల్లో వేసవి సెలవులు అనంతరం నేటి వరకు ఉపాధ్యాయులు అందుబాటులో లేక విద్యార్థులకు విద్య దూరమైందన్నారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయుడులను నియమించాలన్నారు. ఈనెల 15వ తేదీలోగా ఉపాధ్యాయులను నియమిస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎ.బుజ్జిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులు సింహాచలంనాయుడు, ధనుంజయ్

జి.మాడుగుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి జిల్లా కార్యదర్శి ఎస్. శాంతికుమారి ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా ఎస్.సింహాచలంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా ఎం.రవి, ఎం.శ్రీనివాస్, కె.నాగమణి, కార్యదర్శులుగా యు.ధర్మారావు, వి.సత్యనారాయణనాయుడు, ఆర్.విజయ్ కుమార్, టి.కళ్యాణి ఎన్నికయ్యారు. కౌన్సిలర్లు కె.రంజన్‌కుమార్, ఎ.రామచంద్రుడు, ఎ. నీలకంఠంనాయుడు, ఎ. అనుసూయ. కె.నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్‌మోహన్‌రావు పరిశీలకులుగా వ్యవహరించారు.

'ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి'

చింతపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ప్రతి ఒకరూ అక్షరాస్యులు కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. సోమవారం కళాశాలలో ఇంగ్లీష్ డిపార్టుమెంట్ అధ్యాపకులు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తుందన్నారు. నిరక్షరాసులు మోసపోకుండా ఉండాలంటే విద్యను నేర్చుకోవాలన్నారు. ఏ వయస్సువారే అక్షరజ్ఞానం పెంచుకోవడం వల్ల నిత్యజీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఇంగ్లీష్ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ జి. కేజియ, అధ్యాపకులు శ్రీనివాసరావు, రవీంద్ర నాయక్, జగదీశ్‌బాబు, గిరిజ శంకర్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన కంటి వైద్యం



నేత్రదానంపై ప్రతిజ్ఞ చేస్తున్న కంటి వైద్యనిపుణులు అనుష, వైద్య సిబ్బంది

చింతపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో దృష్టి సమస్యలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు స్థానిక కంటి వైద్యనిపుణులు అనుష అన్నారు. సోమవారం 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంటి వైద్యనిపుణులు మాట్లాడుతూ 50మంది బాధితులకు కంటి శస్త్రచికిత్సల కోసం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి పంపించామన్నారు. బాధితులకు ఆస్పత్రిలో ఉచిత భోజన, వసతి కల్పిస్తూ శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. అలాగే నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది నేత్రదానంపై ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో అప్తాలమిక్ అసిస్టెంట్ రమణ, ఫిజియోథెరపిస్టు సరోజిని పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆనందరావు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరమ పంచాయతీలో రాజ్‌మా విత్తనాలు, యూరియాను సోమవారం పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ చైర్మన్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు చినగెన్ను, బొంజుబాబు, నాగరాజు, కోగేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిగరువు మండలం ఏర్పాటు చేయాలంటూ ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న మద్దిగరువు, ఇంజరి పంచాయతీ ప్రజలు

జి.మాడుగుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్దిగరువు మండలం ఏర్పాటుతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఇంజరి పంచాయతీ వాసులు పేర్కొన్నారు. సోమవారం వారు మద్దిగరువు మండల సాధన సమితితో కలిసి ఆ ప్రాంతంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మద్దిగరువు మండలం ఏర్పాటుతో విద్య, వైద్యంతోపాటు డోలీ రహిత ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 13 పంచాయతీలకు అనువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని మండలం ప్రకటించాలన్నారు. మారుమూల గిరిజనుల అభివృద్ధి, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మద్దిగరువును మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, మండల సాధన సమితి నేతలు ఎల్.మాలన్న, పి.రత్నం, జి.కొండబాబు, కె.కామేశ్వరరావు, టి.దయనిధి, సూర్యనారాయణ, కె.జీవాన్, బి.భగవాన్, సీహెచ్ గణపతి తదితరులు పాల్గొన్నారు.



కొణతాలకు వినతిపత్రం అందిస్తున్న గోమంగి మండల సాధన సమితి ప్రతినిధులు

గోమంగిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలి

పాడేరురూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పెదబయలు మండలంలోని గోమంగిని మండలంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ గోమంగి మండల సాధన సమితి ప్రతినిధులు సోమవారం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందించారు. సోమవారం ఆయన్ని అనకాపల్లిలోని నివాసగృహంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొణతాల మంత్రిగా ఉన్నప్పటి నుంచి గోమంగిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని ఉద్యమించామన్నారు. స్పందించిన రామకృష్ణ మాట్లాడుతూ మీరు చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు కొండలరావు, రాధాకృష్ణ, అనంత పద్మనాభం, బాలరాజు పాల్గొన్నారు.

అక్రమాలను అరికట్టేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు

▸▸ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలయ్యపడాల్

చింతపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోనంగి బాలయ్య పడాల్ అన్నారు. సోమవారం తాజంగి గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ మహేశ్వరితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలయ్య పడాల్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు, కూటమి నాయకులు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బోనంగి బెన్నలింగేశ్వరరావు, ఆంద్రాబు లక్ష్మణరావు, మల్లేశ్, పాంగి రాము, పురుషోత్తం పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు సూచించారు. సోమవారం ఆయన నుర్మతి పంచాయతీ వాకపల్లిలో స్థానిక సర్పంచ్ టి.సూరిబాబుతో కలిసి స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ విధానంతో అవకతవకలకు తావు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంశీకృష్ణ, చిరంజీవి, టి.మూర్తి, సెల్స్‌మన్ సింహాచలం, పోతురాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరులో సోమవారం స్థానిక సచివాలయం వద్ద వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఉపసర్పంచ్ కె.వల్లీప్రసాద్ పంపిణీ చేశారు. సీలేరు డిపో పరిధిలో 842 కార్డులు ఉండగా, ప్రస్తుతం 800 కార్డులు వచ్చాయని, మిగతా కార్డులు కూడా వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తామని వీఆర్వో దేవదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సీహెచ్ రాము, కె సన్యాసిరావు, కాశీ, మారిబాబు, బాలు, గోవింద్, మింది, సత్యనారాయణ, చక్కరరావు, శ్రీను, పెసా కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ , జీసీసీ సేల్స్‌మన్ నారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలయ్య పడాల్

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పాడేరురూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రముఖ దేవాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం నేపథ్యంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచే భక్తులు పట్టణంలోని మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయం, కనకదుర్గమ్మ, షిర్డీసాయి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొంతమంది భక్తులు దానాలను చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న వెంకటేశ్వరస్వామి, వాసవీ మాత తదితర దేవతా మూర్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, వాసవీ క్లబ్ ప్రతినిదులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

సీలేరు గురుకుల విద్యార్థులకు తీరనున్న వసతి సమస్య

సీలేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీలేరు బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతి కోసం రూ.2 కోట్లతో నిర్మించిన భవనం ఎట్టకేలకు పూర్తయింది. ఈ పాఠశాలలో ఐదు నుంచి పదవ తరగతి వరకు 430 మంది విద్యార్థులుండగా వీరికి వసతి కోసం రెండు భవనాలు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయుల రూమ్‌ల్లో కూడా ఉండేవారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను మంజూరు చేసింది. అయితే చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బకాయి బిల్లులను మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి పూర్తి చేశారు. ఈ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. కొత్త భవనం వినియోగంలోకి వస్తే విద్యార్థులకు వసతి సమస్య తీరుతుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుజ్జిబాబు తెలిపారు.



గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన బ్లాక్

శ్రమదానంతో రహదారి మరమ్మతులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని గిరిజనులు శ్రమదానంతో మరమ్మతు చేసుకుంటున్నారు. ఈ రోడ్డు మధ్యలోని బూరుగుమెట్ట గ్రామం నుంచి పూలబంద వరకు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి దెబ్బతింది. అటుగా రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులపై అధికారులు స్పందించలేదు. సోమవారం బూసిపుట్టు పంచాయతీ మాజీ సర్పంచ్ వంతాల మంగ్లన్న ఆధ్వర్యంలో యువత శ్రమదానంతో సుమారు మూడు కిలోమీటర్ల వరకు రహదారి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై పేరుకుపోయిన మట్టి, బండరాళ్లను తొలగించారు. వాహన రాకపోకలు జరిగే విధంగా రహదారిని బాగుచేశారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్రమదానంతో రహదారి మరమ్మతు పనులు చేస్తున్న గిరిజనులు

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీ వద్ద అంగన్‌వాడీ కేంద్రం- 1 భవనాన్ని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతుతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని, గతంలోని భవనం లేకపోవడం తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. మండల పరిషత్ నుంచి రూ.7.5 లక్షలు, జిల్లాపరిషత్ నుంచి రూ2 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చొరవచూపిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలోని సీడీపీవో సుగుణ, వైసీపీ నాయకులు కె.సూర్యనారాయణ, ఆనంద్, గంగన్నదొర, జనసేన నేత మురళి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

హుకుంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం సత్కారం జరిగింది. మఠం పంచాయతీ పరిధిలోని దూరివీధి పాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరావు, ఉపాధ్యాయుడు సన్యాసిరావులకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, సర్పంచ్ శాంతికుమారి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దూరివీధి పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మత్యకొండబాబు గోపాల్, బాలయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న శాంతికుమారి

రైతులకు అందుబాటులో యూరియా : ఏడీఏ

చింతపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు యూరియా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందని స్థానిక వ్యవసాయ సహాయక సంచాలకులు(ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ అవసరమైన యూరియాను పూర్తి స్థాయిలో సరఫరా చేస్తుందన్నారు. చింతపల్లి మండలానికి మంగళవారం 20టన్నులు, జీకేవీధికి 24, కొయ్యూరుకి 32టన్నుల యూరియా వస్తుందన్నారు. ఈ యూరియా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు. గిరిజన రైతులు యూరియాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసుదనరావు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలకు బారులు తీరిన రైతులు

సీలేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 పంచాయతీల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద రాజ్‌మా విత్తనాల పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది మండలానికి 854 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు కావాలని ప్రతిపాదనలు పంపగా 770 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని మండల వ్యవసాయాధికారి గిరిబాబు తెలిపారు. వీటిని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు ఇప్పటికే తరలించి, రైతులకు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దుప్పులవాడ రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు మాత్రమే ఇంకా విత్తనాలు పంపిణీ కాలేదన్నారు. సోమవారం ధారకొండ రైతు సేవా కేంద్రం పరిధిలో 90 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. అయితే గిరిజన రైతులు విత్తనాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరారు.

జన్‌మన్ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలి



జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నేత పాండురంగస్వామి, తదితరులు

పాడేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని టీడీపీ డివిజన్ నేత, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, లబ్ధిదారులు సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీలో గూడు లేని ఆదిమ జాతి గిరిజనులకు పీఎం జన్‌మన్ పథకంలో ఇళ్లు మంజూరు చేయడం శుభపరిణామన్నారు. అయితే ఆయా ఇళ్ల నిర్మాణలను చేపడుతున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఇళ్ల బిల్లులను సకాలంలో మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు కిల్లో లైకెన్, కిరసాని రఘురామ్, బోరంగి జైసేన్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాల అధిరోహణకు విద్య కీలకం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో ఉన్నత శిఖరాల అధిరోహణకు విద్య ఎంతో కీలకమని ఎంపీపీ ఎ.సీతమ్మ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు సమాజంలో అక్షరాస్యత-దానిపై ఉపయోగంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అధికంగా నిరక్షరాసులు ఉన్నారని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వయోజన విద్యను పోత్సహించాలని, ప్రధానంగా చదవడం, రాయడం నేర్పాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ కొండన్నదొర, మాజీ సర్పంచ్ జయదేవ్, అధ్యాపకులు విశ్వేశ్వరరావు, కోటిబాబు, దామోదరం పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే



కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సోమవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సందర్శించారు. ముందుగా తరగతి గదుల్లో విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు చాలడం లేదని, బాలురు వసతిగృహం అర్థాంతరంగా నిలిచిపోయిందని, దీంతో విద్యార్థులు అద్దె గదుల్లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ కళాశాలలోని నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు దృషికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, నాయకులు బడ్నాయిన చంటిబాబు, సోమేల స్వామి, కళాశాల ప్రిన్సిపల్ ప్రమీల పాల్గొన్నారు.

సోలార్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన

పెదబయలు, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోలార్ లైట్ల ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేసినట్టు జడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు తెలిపారు. సీఎస్ఆర్ నిధుల నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు రూ.30 లక్షలతో 27 సోలార్ లైట్లను మంజూరు చేశారన్నారు. పెదబయలు మండలానికి కేటాయించిన 3 లైట్‌లను పెదబయలు ప్రధాన కూడలిలో ఒకటి, పీహెచ్‌సీ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీధి లైట్లు విద్యుత్ అవసరం లేకుండా సోలార్ ద్వారా పనిచేస్తాయన్నారు. నాలుగు వైపులా వెలుతురును అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంపరాయి సూరయ్య, పాంగి సింహచలం, కొమ్మ అనంతపద్మనాభం, కొమ్మ బాలరాజు, రూడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అంకితభావంతో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని సీడీపీవో రాణి చెప్పారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం అధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మాన కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ సకాలంలో పోషకాహారాన్ని అందించి గర్భిణులు, చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యటఉడు పీటీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించకుండా రాజకీయాలా..!

- జడ్పీటీసీ సభ్యురాలిపై సర్పంచుల ఆగ్రహం
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలపై చర్చించకుండా రాజకీయాలు మాట్లాడతారా? అని జడ్పీటీసీ సభ్యురాలిపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ఎన్నడూ రాని జడ్పీటీసీ సభ్యురాలు, నేడు అల్లరి చేయడానికి వచ్చినట్టు ఉందని ఎద్దేవా చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో పథకాల కన్నా సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. దీంతో చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు స్పందిస్తూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసింది తక్కువ ఆర్భాటం ఎక్కువన్నారు. సమావేశానికి ఏనాడూ రాని జడ్పీటీసీ సభ్యురాలు, నేడు సమావేశంలో అల్లరి చేయడానికి వచ్చినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంలో జడ్పీటీసీ సభ్యురాలును పలువురు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

తెలుగుదేశం పార్టీ సర్పంచులు నిలదీశారు. సమావేశాలు పక్కదారి పట్టకుండా గ్రామ సమస్యలపై మాట్లాడాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ చేసిన సూచనలను కూడా జడ్పీటీసీ పట్టించుకోకుండా ఎంపీపీపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎంఈవో సత్యనారాయణ చెబుతుండగా, ఎ.కోడూరు ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ప్రశ్నించారు. ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో మాట్లాడుతున్నారని, ఎ.కోడూరు హైస్కూల్‌లో కూడా అధికంగా విద్యార్థులు చేరారని ఎంఈవో బదులిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యుత్ చార్జీలు ఎక్కడా పెరగలేదని, గత వైసీపీ ప్రభుత్వంలోనే పెరిగాయని, అవసరమైతే 2019 నుంచి 2024 వరకు గణాంకాలు పరిశీలించాలని వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్ అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై చర్చించకుండా రాజకీయాలు మాట్లాడటం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు సామాన్యులకు అందుతున్నాయా? లేదా? అని చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. ప్రతీ రైతుకు యూరియా సక్రమంగా అందేలా చూసుకోవాలని ఆదేశించారు. రైతులు నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించేలా కృషి చేయాలన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాల పూర్తికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ భుజంగరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5.15 లక్షలు


8ఎన్‌పీ5 దుర్గామల్లేశ్వర ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.5.15 లక్షలు వచ్చినట్టు దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు తెలిపారు. అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి 52 రోజులలో భక్తులు హుండీలలో వేసిన కానుకలు సోమవారం లెక్కించామని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కేబీ ఆశకిరణ్మయి, వీఆర్వో, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


గౌరీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్న భక్తులు

చోడవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రహణం కారణంగా ఆదివారం మూతపడిన ఆలయాల్లో సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం సోమవారం ఉదయం తిరిగి తెరుచుకున్నాయి. స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయాన్ని సంప్రోక్షణ అనంతరం తెరిచారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రహణం అనంతరం తెరుచుకున్న ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి గౌరీశ్వరుడిని దర్శించుకున్నారు.

యూరియాపై వైసీపీ దుష్ప్రచారం

జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వీరసూర్యచంద్ర

నాతవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా దొరకడం లేదని వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం జనసేన నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో రైతులకు సకాలంలో ధాన్యం బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం జరిగిందన్నారు. నేడు నర్సీపట్నం నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొరత ఉందంటూ వైసీపీ దుష్ప్రచారం చేయడమేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, పార్టీ నేత పోలుపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిశీలన


జి.కోడూరు ఆరోగ్య కేంద్రం ఆవరణలో కేంద్ర బృందం వైద్యులు

మాకవరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరులో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జాతీయ నాణ్యత బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత మంది రోగులకు చికిత్స అందించారు.. వారికి నాణ్యమైన మందులు ఇస్తున్నారా? లేదా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి మణికంఠ, మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీతామహాలక్ష్మి, ఎంపీహెచ్‌వో సత్తిబాబు, టీడీపీ నేత జయబాబు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం


దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు మధ్యలో వీధి కుక్కల గుంపు

దేవరాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బెడద ఎక్కువైనా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోనే గుంపులు, గుంపులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక విలేకరి కుక్కల గుంపునకు భయపడి అడ్డంగా పడిపోయాడు. ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి గాయపడ్డాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కుక్కల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వం కృషి

డిజిటల్ విద్యతోనే బంగారు బాట: ఎమ్మెల్యే బండారు

బేతపూడి కేజీబీవీలో కంప్యూటర్ల భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకే విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభ, అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుత సాంకేతిక, డిజిటల్ విద్య ఇవ్వడానికి పోటీ పడుతుందన్నారు. భవిష్యత్ మెరుగైన అవకాశాలు కల్పించాలంటే విద్యా వ్యవస్థను పటిష్ట పర్చడానికి సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అత్యంత కీలక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారన్నారు. ఇటీవల డీఎస్సీ ద్వారా యువత ఉద్యోగాల్లో చేరిందన్నారు. రౌండు టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థసహకారంతో 12 కంప్యూటర్‌లు ఏర్పాటు చేయగలిగామన్నారు. అలాగే కె.కోటపాడు, బేతపూడి కేజీబీకేకి 25 కంప్యూటర్లు సమకూర్చారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ విద్యను అందించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, రౌండు టేబుల్ ఇండియా ప్రతినిధులు యశ్వంత్ రాటి, గుర్వన్స్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సిహెచ్.భువన మాధురి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు పూడి.సత్యారావు, సర్పంచ్ చల్లా లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ బారతి, నానాజీ, తాతయ్యలు పాల్గొన్నారు.

ఎరువులపై వదంతులు నమ్మొద్దు

- రైతులందరికీ అందిస్తాం: అధికారుల బృందం


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధికారులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల కొరత ఎక్కడా లేదని, దీనిపై వదంతులు నమ్మవద్దని మండల స్థాయి అధికారుల బృందం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భానోజీరావు, తహశీల్దార్ ఎం.లక్ష్మి, వ్యవసాయాధికారి భాస్కరరావు, అడిషనల్ ఎస్ఐ భాస్కరరావు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 2339 హెక్టార్లలో ఇప్పటి వరకు 2034 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. వరి పంటకు 370 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 332 మెట్రిక్ టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేశామని ఏవో భాస్కరరావు తెలిపారు. కొంత మంది రైతులు అపోహలతో అవసరం లేకపోయినా ఎరువులు ఎక్కువ తీసుకుని భవిష్యత్ అవసరాలకు దాచి పెడుతున్నారన్నారు. ఎకరా వరికి దమ్ములో 40 కిలోలు, నెల తరువాత 30 కిలోలు అవసరం కాగా, రైతులను ఎక్కవ వాడుతున్నారని చెప్పారు. కాంప్లెక్స్ ఎరువులు వాడితే యూరియా కొరత తగ్గుతుందన్నారు. ఎరువులు ఎక్కువ వాడడం వల్ల రైతులకు ఖర్చు పెరిగిపోతుందని హెచ్చరించారు. నిర్దేశించిన మెతాదులో యూరియా వాడితే ఎరువులు కొరత రాదన్నారు. త్వరలో మండలానికి యూరియా చేరుతుందన్నారు. ప్రతీ రైతుకు ఎరువులు అందిస్తామని, ఎరువుల కొరత ఎక్కడా లేకుండా చూస్తామని, యూరియా వసరమైతే మండల స్థాయి అధికారులను సంప్రదించాలని కోరారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినంత సరఫరా చేస్తామని వారు తెలిపారు.

ఉపాధి కూలి చెల్లించాలని ఖాళీ కంచాలతో నిరసన


కూలి సొమ్ము చెల్లించాలని కంచాలతో నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

రావికమతం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అజయ్‌పురంలో ఉపాధి పనులకు కూలి సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తూ మూడు గ్రామాల ఆదివాసీలు సోమవారం ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. వ్యవసాయ, కార్మిక, గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో చీమలపాడు పంచాయతీ శివారు నేరేడుబంద, జీలుగులోవ, అజయ్‌పురం గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు మాట్లాడుతూ, ఈ మూడు గ్రామాలకు చెందిన 150 మంది ఆదివాసీలు గత జూన్ నుంచి ఆగస్టు వరకు పది నెలల పాటు ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్నారన్నారు. అప్పటి నుంచి కూలి చెల్లించకపోవడంతో పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి కూలి చెల్లించాలని నిబంధనలు ఉన్నప్పటికీ, అధికారులు అమలు చేయడం లేదని వాపోయారు. దీంతో వైద్యానికి, రోజువారీ ఖర్చులకు ఆదివాసీలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా కూలి సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిరంజీవి, సూరిబాబు, శ్రీరామ్ పాల్గొన్నారు.

మన్యపురట్ల పాఠశాలకు మైక్రోస్కోపు వితరణ

నాతవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యపురట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పుణ్యమంతుల బాబ్జీ మైక్రోస్కోపును వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి బాబ్జీ వంటి వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనిమిన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓ మాదిరిగా ఎండ కాసింది. తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది.

విశాఖ-దేవరాపల్లి బస్సుల్లో ప్రయాణం.. నరకం

- వర్షం పడితే కారిపోతున్న బస్సులు

దేవరాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) విశాఖపట్నం-దేవరాపల్లి బస్సులో ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నది. వర్షం వస్తే బస్సులు కారిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక గొడుగులు వేసుకుంటూ బస్సులో రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన బస్సులు వేయడం, సరిపడా బస్సులు లేకపోవడంతోనే ఇబ్బందులు పడుతున్నామని ఆవదన వ్యక్తం చేశారు.


55డీ బస్సులో గొడుగు వేసుకున్న ప్రయాణికుడు

పరిమితికి మించి బ్లాస్టింగులు చేయొద్దు


క్వారీ యజమానులతో సమావేశమైన తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా క్వారీ నిర్వహించుకోవాలని, లేనిపక్షంలో అనుమతులు రద్దు చేస్తామని తహశీల్దార్ నాగమ్మ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో రాజన్న క్వారీ యజమాని, నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్వారీ నిర్వహణకు సంబంధించి పంచాయతీ తీర్మానం, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, ఇండస్ట్రియల్ అనుమతి పత్రాలను ఆమె పరిశీలించారు. ఇతర అనుమతి పత్రాలు అందుబాటులో లేకపోవడంతో రెండు రోజుల్లో కార్యాలయానికి సమర్పిస్తామని క్వారీ యజమాని వీర్రాజు తహశీల్దార్‌కు విన్నవించారు. పరిమతికి మించి బ్లాస్టింగ్‌లు చేపట్టవద్దని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆమె ఆదేశించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి: డాక్టర్ సురేఖ


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేఖ

రావికమతం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ సూచించారు. కొత్తకోట ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారన్న సమాచారం మేరకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జలుబు, దగ్గుతో బాధపడుతున్న నలుగురు విద్యార్థులకు ఆర్డీ కిట్లతో వైద్య పరీక్ష నిర్వహించగా, జ్వరాలు ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. వారికి చికిత్స చేసి అవసరమైన మందులు అందించామని డాక్టర్ సురేఖ తెలిపారు. వర్షాకాలం ముగిసే వరకు విద్యార్థులు కాచి ఒడబోసినే నీటినే తాగాలని చెప్పారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది రామారావు, రమణమ్మ, ఎర్రమ్మ, గోవింద్ పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాలకు ప్రత్యేక శిబిరం రేపు

నర్సీపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ కోసం ఈ నెల 10న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంఈవో తలుపులు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు శిబిరం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాల పరిధిలోని 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికేట్, ఆధార్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. శారీక వైకల్యం ఉన్న విద్యార్థులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్, వీల్ చైర్లు, వినికిడి లోపం ఉన్నవారికి వినికిడి యంత్రాలు, దృష్టి లోపం బ్రెయిలీ కిట్స్, మేధో వైకల్యం ఉన్నవారికి ఎంఆర్ కిడ్స్ ఉచితంగా ఇస్తామని ఆయన తెలిపారు.

సీహెచ్‌సీ కమిటీ చైర్మన్‌గా దేవరపల్లి

మరో ముగ్గురు సభ్యుల నియామకం


వెంకట అప్పారావు

చోడవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. సభ్యులుగా పప్పు శ్రీను, బాలిబోయిన పార్వతి, బొబ్బిలి ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ కమిటీ త్వరలో ప్రమాణ స్వీకారం చేయనుంది. కాగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నియమించడంపై దేవరపల్లి వెంకట అప్పారావు, సభ్యులు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తామని వారు స్పష్టం చేశారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

మాకవరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాల గ్రామంలో అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము మాట్లాడుతూ ప్రతీ మనిషిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది విద్య మాత్రమేనన్నారు. అందరూ అక్షర జ్ఞానం కలిగి ఉండాలని కోరారు. ప్రస్తుతం శాస్త్ర సాంకేతకతను అర్థం చేసుకుంటూ జ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి


గేదె వద్ద రోదిస్తున్న బాధితురాలు

దేవరాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన శతపతి ఈశ్వరమ్మ భర్త చనిపోవడంతో గేదెను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో కొప్పాక చెరువు కళ్లాల వద్ద ఈశ్వరమ్మకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ చింతల వెంకటరమణ బాధితురాలిని పరామర్శించారు.

మాడుగుల ఎస్ఐకు సత్కారం

మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండలంలో వినాయక చవితి వేడుకలతో పాటు అనుపోత్సవ కార్యక్రమాలు ప్రశాంతంగా జరగడానికి కారకులైన మాడుగుల ఎస్ఐ జి.నారాయణరావు, భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు సోమవారం శాలువతో సత్కరించి మెమొంటోను అందచేశారు. ఒకే రోజు 20 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం జరిగిందని, ఎన్నడూ లేని విధంగా అల్లర్లు జరగకుండా ఎస్ఐ కృషి చేశారన్నారు. ఆయనకు బందోబస్తు నిర్వహించి ప్రశాంతంగా నిమజ్జనం చేయడం జరిగిందని, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు ఎస్ఐ జి.నారాయణరావును అభినందించారు. కార్యక్రమమలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు గౌరీ పట్టపు మహేశ్ కుమార్, సతీశ్, జాగాని ఈశ్వరరావు, పి.బలరాం, పేలూరి కృష్ణారావు, మణికంఠ, చందు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

- తప్పిన ప్రమాదం

దేవరాపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో బాలు టిఫిన్ సెంటర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొంది. దీంతో స్తంభం ఒరిగిపోయింది. తీగలు కిందకు పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నాలుగు రోడ్డు కూడలికి వెళ్లే మార్గం కావడంతో ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్‌కు రాక ఇబ్బంది పడ్డారు. అటు వైపు ఎవరూ వెళ్లకుండా ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందిని పెట్టి దారి మళ్లించి ఇబ్బందులు లేకుండా చేశారు.

తహశీల్దార్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

మాడుగుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్పడుతున్న అక్రమాలపై రెవెన్యూ విజిలెన్స్ విచారణ జరపాలని గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొలుగొండ మండలం పాత మల్లంపేటలో ఆదివాసీల భూములను కాసులకు కక్కుర్తిపడి రెవెన్యూ రికార్డులు తారు మారు చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టాలని ఆదేశించారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తహశీల్దార్ అకతవకలపై విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ మోసూరి రాజు, కోకన్వీనర్ తుర్రే రవి, గిరిజనులు పాల్గొన్నారు.

ఫోబియా పరేషాన్



ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య

30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు

కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం

సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా.? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్టే. కొన్నాళ్లుగా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపున్న వారిలో సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ నగర పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.

ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్టరో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు.



ఇవీ ప్రధాన లక్షణాలు

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవ డం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్‌లెస్‌గా ఉండడం, ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోపైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. అధిక ఆలోచన, కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతా భావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం కూడా కారణ మంటున్నారు.

బయటపడే మార్గమేదీ.?

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి అంశాలు ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.



లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి



ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబసభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణు లను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడుతుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణమవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది.

- డాక్టర్ భాగ్యారావు, మానసిక వైద్య నిపుణులు

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, శంకరరావు ఎన్నిక



వి.వి.శ్రీనివాసరావు



రుత్తల శంకరరావు

చోడవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా వి.వి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా రుత్తల శం కరరావులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆదివారం ముగిసిన సీఐటీయూ జిల్లా మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 84 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కోశాధికారిగా గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పరమేశ్వరరావు, మజ్జి నాగేషు, వి.సత్యవతి, గూనూరు వరలక్ష్మి, జి.కోటేశ్వరరావు. గంటా శ్రీరాం, కార్యద ర్శులుగా రొంగలి రాము, జి.దేముడునాయుడు, అడిగర్ల రాజు, ప్రేమ, చంద్రశేఖర్, రూపాదేవి, మనబాల రాజేశ్‌లు ఎన్నికయ్యారు.

నేడు చాగంటికి కొప్పరపు కవుల పురస్కారం ప్రదానం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చే యనున్నట్టు కొప్పరపు కవుల కళాపీఠం నిర్వాహకులు సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియం లో మంగళవారం సాయంత్రం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, లిపి సంస్థ (కాలిఫోర్నియా) సీఈవో సాగర్ అనిసింగరాజు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం ఈ పురస్కారాన్ని చాగంటికి ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

హిజ్రాలకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిజ్రాలకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంచాలకురాలు కె.కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జాతీయస్థాయి ఐటీ/ఐటీఈఎస్ రంగాలలో ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందన్నారు. అభ్యర్థులకు ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత ఉండాల న్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఆసక్తి గల హిజ్రాలు దరఖాస్తు లు పొందవచ్చునన్నారు. ట్రాన్స్ జెండర్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, విద్యార్హతల నక ళ్లతో పూర్తి చేసిన దరఖాస్తులను తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2952585 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఆగుతూ.. సాగుతూ!

... 5వ పేజీ తరువాయి



శ్లాబ్ దశలోనే ఉన్న దుకాణ సముదాయం రెండో ఫ్లోర్

భవనం నిర్మించినప్పటికీ ఉద్యోగులు ఎవరూ స్థానికంగా ఉండడం లేదు. విశాఖ నుచి చుట్టం చూపుగా వచ్చి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల కళా క్షేత్రం పనుల పర్యవేక్షణకు వచ్చిన వీఎంఆర్‌డీఏ ముఖ్య అధికారి ఒకరు.. ఇక్కడ జరుగుతున్న పనుల తీరును చూసి తీవ్రఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కళా క్షేత్రంలో వాస్తుకు విరుద్ధంగా ఈశాన్య మూలలో మరుగుదొడ్లు ఎలా నిర్మిస్తారని ఆయన ప్రశ్నించినట్టు తెలిసింది. తక్షణమే మరుగుదొడ్లను వెంటనే తొలగించి, వేరేచోట నిర్మించాలని ఇంజనీర్లను ఆదేశించారు. దీంతో వారం రోజుల నుంచి మరుగుదొడ్ల గోడలను కాంట్రాక్టర్ తొలగిస్తున్నారు. కాగా కళా క్షేత్రం ఆధునికీకరణ పనులు పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు ఇక్కడ కానరాకపోవడంతో కాంట్రాక్టర్ల నాసిరకంగా పనులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్ రావు గోపాలరావు కళా క్షేత్రం ఆధునికీకరణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

» పీజీఆర్ఎస్‌లో 232 వినతుల స్వీకరణ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ఇక్కడ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలకు సంబంధించిన సమస్యలు, ఇతర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావులతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని, అదే విధంగా ఒకే సమస్యకు సంబంధించి ప్రజలు పలుమార్లు అర్జీలు ఇవ్వాల్సిన అవసరం రాకుండా దృష్టి సారించాలన్నారు. శాఖల వారీగా అర్జీల పరిష్కార పరిస్థితిని రోజూ పర్యవేక్షణ చేసి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పీజీఆర్ఎస్ ముగిసే సరికి 232 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అనిత, డీఈవో అప్పారావునాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో స్వీకరించే అర్జీలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతీ అర్జీని నిశితంగా పరిశీలించి వాస్తవాన్ని నిర్ధారించుకున్న తరువాత చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పీజీఆర్ఎస్‌లో 47 అర్జీలు అందగా వీటిలో ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నాయి.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం!

... 5వ పేజీ తరువాయి

వరకు ఏకధాటిగా కురిసింది.పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి గజపతినగరం వరకు ప్రధాన రహదారిపై వర్షం నీరు పారింది. దీంతో రహదారి మొత్తం చెరువును తలపించింది. ఇక పట్టణంలోని బాలాజీనగర్, బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డులో ఏవి కాలువలు, ఏవి రోడ్లు తెలియనంతగా వర్షం నీరు పారింది. మెయిన్ రోడ్డులో భారీ గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపించాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి.

స్త్రీశక్తికి అనూహ్య ఆదరణ

... 5వ పేజీ తరువాయి

అమల్లోకి వచ్చిన తరువాత విశాఖ వెళ్లే మహిళా ప్రయాణికుల్లో అత్యధికులు ఎక్స్‌ప్రెస్‌లు, పల్లె వెలుగు బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో వైజాగ్ రూట్లో నాన్‌స్టాప్ బస్సుల్లో ఓఆర్ 5-6 శాతం మేర తగ్గింది. కాగా నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు, బంగారమ్మపాలెం నడుపుతున్న బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ రూట్‌లలో మరో రెండు సర్వీసులు నడపాల్సిన అవసరం వుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

డెక్కన్ రెమెడీస్‌లో కెమిస్ట్ మృతి

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించాడు. మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడ నుంచి అడ్మిన్ బ్లాక్‌కు వచ్చేశాడు. తరువాత కళ్లు తిరుగుతున్నాయని సహచర సిబ్బందికి చెప్పడంతో లంకెలపాలెంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. పోలినాయుడుకు భార్య లలితకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇదిలా వుండగా మిథనాల్ స్వాలెంట్ ప్రాసెసింగ్ పర్యవేక్షించడానికి వెళ్లిన పోలినాయుడు.. నాసిరకం మాస్క్ ధరించడం వల్ల విషవాయువులు పీల్చడంతో అస్వస్థతకు గురై మృతిచెందాడని, యాజమాన్యం పీపీఈ కిట్‌ను సరఫరా చేయకపోవడంతో అస్వస్థతకుఏ గురై ప్రాణాలు కోల్పోయాడని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్యం చర్యలు చేపట్టాలి

ఉద్యోగి మృతికి కారణమైన డెక్కన్ రెమెడీస్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోలినాయుడు తీవ్ర అస్వస్థతకు గురై నాలుగు రోజులు అయినప్పటికీ ఈ విషయాన్ని బయటకు వెల్లడించకపోడం దారుణమన్నారు.

యూరియా కొరత లేదు

... 5వ పేజీ తరువాయి

సమయాల్లో మూడు విడతలుగా 25 కిలోల చొప్పున యూరియా వేయాలన్నారు. అందువల్ల ఆయా సమయాల్లో రైతులకు యూరియాను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని వెల్లడించారు. ఎక్కడైఎరువుల కొరత లేనప్పటికీ రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. గత ఐదేళ్లలో రైతులకు ఏం చేశారో వైసీపీ నాయకులు చెప్పాలని అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు.

92 నోటీసుల కోసం రైతుల నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

ఉంది? తప్పులు ఏమైనా ఉన్నాయా? అన్నది చూసుకొని, ఒకవేళ తప్పులు వుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలి. అన్నీ సక్రమంగా వున్నట్టు రైతు నిర్ధారించిన తరువాతే భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయి.


గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వేలో పెద్ద ఎత్తున తప్పులు, పొరపాట్లు దొర్లాయి. పలు గ్రామాల్లో జిరాయితీ భూములను ప్రభుత్వ భూములుగా నమోదు చేశారు. వీటిని సరిచేయాలంటూ సంబంధిత రైతులు రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు చేశారు. తప్పుల తడకగా వున్న భూ సర్వేపై అప్పట్లో ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం పార్టీ నాయకులు రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. కానీ అధికారులు, నాటి పాలకులు పట్టించుకోలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రీసర్వే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే అన్ని గ్రామాల్లో ఒకేసారి కాకుండా, తొలుత ప్రతి మండలంలో రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అధికారులు సర్వే నిర్వహించారు. మాకవరపాలెం మండలంలో లచ్చన్నపాలెం, పైడిపాల గ్రామాల్లో భూముల రీసర్వే చేశారు. అంతకుముందు వైసీపీ హయాంలో నిర్వహించిన సర్వేలో దొర్లిన పొరపాట్లు ఈసారి జరగవని రైతులు భావించారు. రెండు గ్రామాల్లో కలిసి 3,584 ఎకరాలను రీసర్వే చేశారు. ఈ ప్రక్రియ పూర్తయి మూడు నెలల దాటింది. ఆయా రైతులకు '92 నోటీసులు' జారీ చేయాలి.

ఇందులో గ్రామం పేరు, రైతు పేరు, సర్వే నంబరు, భూమి విస్తీర్ణం, వగైరా వివరాలు వుంటాయి. నోటీసులో అన్ని వివరాలు సక్రమంగా వుంటే.. రైతు నోటీసును తన వద్దనే వుంచుకుంటారు. లేకపోతే ఏయే వివరాలు తప్పుగా వున్నాయో పేర్కొంటూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.

మూడు నెలలు కిందట నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి.రమణ ఇక్కడ సచివాలయంలో నోటీసులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి, లాంఛనంగా సుమారు పది మంది రైతులకు నోటీసులు అందజేశారు. కొద్ది రోజుల్లోనే మిగిలిన రైతులందరికీ నోటీసులు అందుతాయని ఆయన చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క రైతుకు కూడా నోటీసు ఇవ్వలేదు. దీనిపై సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. భూముల సర్వే వివరాల పుస్తకాలు ఆయా సచివాలయాల్లో అందుబాటులో వున్నాయని, రైతులు స్వయంగా వెళ్లి పరిశీలించుకోవచ్చని చెప్పారు. '92 నోటీసులు' ఎప్పుడు జారీ చేస్తారని ఆయనను ప్రశ్నించగా, నోటీసులు తయారు చేస్తున్నామని, త్వరలో రైతులకు అందజేస్తామని తెలిపారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రసాదుల సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

మునగపాక, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయుడుపాలెంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారాయుడుపాలెం గ్రామానికి చెందిన రైతు ప్రసాదుల సన్యాసిరావు (46) సోమవారం మధ్యాహ్నం పొలం పనుల్లో భాగంగా కల్లానికి బయలుదేరారు. దారిలో గట్టుపై పడిఉన్న కరెంటు వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో వున్న రైతులు చూసి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. భార్య వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు వచ్చి కన్నీరుమున్నీరు అయ్యారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వేంపాడులో 3.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ

నక్కపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడులో సోమవారం మూడున్నర తులాల బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. వేంపాడు రామాలయం వెనుక కె.నాగేశ్వరరావుకు కిరాణాషాపు వుంది. సోమవారం ఉదయం షాపులో తన భార్య మణికుమారిని వుంచి, అతను సొంత పనిపై తుని వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మణికుమారి షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు మెయిన్‌గేటుకు వేసి వున్న తాళాలు పగులగొట్టి వుండడంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూశారు. ట్రంకుపెట్టె తాళాలు పగులగొట్టి వుంది. అందులో భద్రపరిచిన రెండు తులాల బంగారం చైను, అర తులం బంగారు లాకెట్, అర తులం బంగారం ముద్ద, పావు తులం బంగారు ఉంగరం, మరో పావుతులం లక్ష్మీదేవి ఉంగరం కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐ అంజుమ్, క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

శారదానదిలో గల్లంతైన యువతి మృతదేహం లభ్యం



బి.కీర్తికుమారి (ఫైల్ ఫొటో)

కశింకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మలాడ శారదానదిలో ఈ నెల 6న గల్లంతైన యువతి మృతదేహం కశింకోట మండలం వెదురుపర్తి శారదానదిలో సోమవారం లభ్యమైంది. అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన బి.కీర్తికుమారి (22) తన తండ్రి భూలోకనాయుడు మందలించాడని శనివారం ఉదయం క్షణికావేశంలో ఉమ్మలాడ శారదా బ్రిడ్జి పైనుంచి దూకినట్టు మునగపాక పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని అటుగా వెళుతున్న ఓ వ్యక్తి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బ్రిడ్జి గట్టుపై ఉన్న సెల్‌ఫోను ఆధారంగా మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆ రోజు నుంచి శారదానదిలో ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఎట్టకేలకు సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో వెదురుపర్తి ప్రాంతంలో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గవరపాలెం ప్రాంతానికి చెందిన కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతురాలి దుస్తుల రంగు ఆధారంగా కీర్తికుమారిగా గుర్తించారు. కాగా ఎన్‌డీఆర్ఎఫ్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్టు మునగపాక పోలీసులు తెలిపారు.

ఏయూ ఆడిట్ కార్యాలయంలో లైంగిక వేధింపులు

అసభ్యకరంగా మెసేజ్‌లు పెడుతున్న ఉన్నతాధికారిని నిలదీసిన ఉద్యోగిని

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఆడిట్ కార్యాలయంలో లైంగిక వేధింపుల వ్యవహారం సోమవారం పెద్ద రచ్చకు దారితీసింది. అసభ్యకరంగా మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్న డిప్యూటీ డైరెక్టర్‌పై ఓ ఉద్యోగిని విరుచుకుపడ్డారు. ఇప్పటికే బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇది జరిగి రెండు రోజులు కాకుండానే మరోసారి మెసేజ్‌లు పెట్టడంతో సోమవారం ఆమె గట్టిగా నిలదీశారు. బుద్ధి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. అనంతరం గొడవ పెద్దది కావడంతో విషయం డిప్యూటీ రిజిస్ట్రార్ దృష్టికి వెళ్లింది. అక్కడ సదరు ఉన్నతాధికారి వేధింపుల గురించి మహిళ ఉద్యోగి వివరించడంతో ఆయనకు చీవాట్లు పెట్టారు. పద్ధతి మార్చుకోవాలంటూ హితబోధ చేశారు. ఇదిలావుంటే ఈ తరహా వేధింపులు సదరు ఉన్నతోద్యోగికి కొత్త కాదని పలువురు పేర్కొంటున్నారు. గతంలోనూ ఇదే తరహా ఆరోపణలు ఉన్నాయంటున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న ఏలూరు, విశాఖ జిల్లా జట్లు

లంకెలపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని పరవాడ మండలం సాలాపువానిపాలెం (జీవీఎంసీ 84వ వార్డు పరిధి)లో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. జనసేన నేత దుల్ల రామునాయుడు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం తూర్పుగోదావరి, విశాఖ జిల్లా గంగవరం ఏజే వారియర్స్ జట్ల మధ్య హోరాహోరా పోటీ సాగింది. ఈ పోటీలో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మాదం శెట్టి నీలబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాలాపు మోహన్‌రావు, సాలాపు శ్రీనివాసరావు, వెంకటఅప్పారావు, సుమన్‌అప్పారావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి ఉరుకూటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక ఆలయంలో గ్రహణ శాంతులు, సంప్రోక్షణ



ఉపమాక ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

నక్కపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణ మోక్షకాలం అనంతరం మండలంలోని ఉపమాక క్షేత్రాన్ని సోమవారం ఉదయం తిరిగి తెరిచారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఆలయాన్ని మూసివేయగా, టీటీడీ ఆగమ సలహాదారుల సూచనల మేరకు సోమవారం ఉదయం కొండపైన, కింద ఆలయాల్లో వున్న స్వామివారికి, పలు దేవతామూర్తులకు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు గ్రహణ దోష పూజా కార్యక్రమాలు, సంప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559